క్లుప్తంగా

దాసాంజనేయుని హుండీ ఆదాయం రూ.11.80 లక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీ దాసాంజనేయస్వామివారి దేవాలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ఆదాయం రూ.11 లక్షల 80 వేల 915 నగదు, కిలో 36 గ్రాముల వెండి లభించింది. దాసాంజనేయస్వామి వారి దేవాలయంలో బుధవారం దేవదాయశాఖ విజయవాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్ కుమార్, సేవాదళం సభ్యుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. 4 నెలల 23 రోజులకు గానూ భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలతో ఈ ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

కాలువల్లో వ్యర్థాలు వేయకుండా చర్యలు



పటమట(విజయవాడతూర్పు): నగరంలో ప్రధాన కాల్వల్లో వ్యర్థాలు లేకుండా అధికారులు నిరంతరం నిఘా ఉండాలని వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం నగరంలోని బందరు కాల్వలో బోటుతో తొలగిస్తున్న వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. నగరంలోని బందరు, ఏలూరు, రైవస్ కాల్వలు నిరంతరం శుభ్రంగా ఉండాలని, అందుకు నగరవాసులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ పర్యటనలో బయాలసిస్ట్ సూర్యకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీ కమిషనర్ పేషీపై ఇంటెలిజెన్స్ నిఘా

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ పేషీలో సుదీర్ఘకాలంగా తిష్టవేసిన పేషీ సిబ్బందిపై ఈ నెల 3వ తేదీన 'పేషీతో పరేషాన్' శీర్షికతో సాక్షి కథనం ప్రచురించగా దీనిపై ప్రభుత్వం స్పందించింది. పేషీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎంతకాలం నుంచి ఉన్నారు..? ప్రమోషన్లు వచ్చినా సీటు కదలకుండా ఎందుకు ఉంటున్నారు..? రాజకీయ లాబీయింగ్ ఉందా..?, హెచ్‌వోడీలను ఏ విధంగా బెదిరిస్తున్నారనే అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. దీనిపై పేషీకి వచ్చేవారి జాబితా, కమిషనర్‌ను కలిసిన వారి వివరాలు సేకరించినట్లు తెలిసింది. పేషీలో కీలకంగా ఉండే సిబ్బంది అధికారుల నుంచి తీసుకున్న ముడుపుల వివరాలు, రామకుటీర్ పేరుతో సాగిన పంపిణీలు తదితరాలను సేకరించారని సమాచారం. దీనిపై మున్సిపల్ శాఖ మంత్రి కూడా ఆరా తీశారని తెలిసింది.

బెరంపార్క్‌లో పచ్చదనం వెల్లివిరియాలి

ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల సంభవించిన కృష్ణానది వరద కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన భవానీపురంలోని హరిత బెరంపార్క్ పునరుద్ధరణ పనులను ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ బుధవారం పరిశీలించారు. బెరం పార్క్ ప్రాంగణం, పరిసరాలను అధికారులతో కలిసి నిశితంగా పరిశీలించారు. వరద ప్రభావంతో ఇంకా అక్కడక్కడ పేరుకుపోయిన బురద మట్టిని వెంటనే తొలగించి శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. శుభ్రం చేసిన ప్రదేశాల్లో వరద ముంపులో నామరూపాలు లేకుండా పోయిన పచ్చదనాన్ని తిరిగి పెంపొందించి గ్రీనరీ వెల్లివిరిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వచ్చే పర్యాటకులకు బెరంపార్క్ పూర్వ వైభవాన్ని తీసుకురావాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా రిసార్ట్స్, రెస్టారెంట్ పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) శేషగిరిరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, డీవీఎమ్ కృష్ణచైతన్య, బెరంపార్క్ యూనిట్ మేనేజర్ కె.శ్రీనివాస్, డీఈ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన నాడు - నేడు పనులు

- రాజీవ్‌నగర్‌లో అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- జీఓ నంబర్ 117కు ప్రభుత్వం తిలోదకాలు



కంద్రిక హైస్కూల్‌లో నిలిచిన తరగతి గదుల నిర్మాణం

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన నాడు – నేడు కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం నిలిపివేసే దిశగా అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చి ప్రైవేటు విద్యాసంస్థలకు ధీటుగా అదనపు తరగతి గదులను, ఇంగ్లిష్ లేబరేటరీ, ఎలక్ట్రిఫికేషన్, తాగునీటి సరఫరా, టాయిలెట్స్ నిర్మాణం, ఫర్నిచర్, పెయింటింగ్స్, మైనర్ అండ్ మేజర్ రిపేర్లలను మొదటి ఫేజ్‌లో వేగవంతంగా పూర్తి చేసింది. రెండో దశలో కూడా అదనపు తరగతి గదుల నిర్మాణాలకు బడ్జెట్‌ను మంజూరు చేసింది. ప్రభుత్వ పాఠశాలలంటే ఈ విధంగా కూడా ఉంటాయా అనే విధంగా కొత్త రూపాన్ని తీసుకొచ్చి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని క్రియేట్ చేసింది. జీఓ నంబర్ 117 ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతి విద్యార్థులను హైస్కూల్‌లో విలీనం చేసి అక్కడే వారికి పాఠ్యాంశాలను బోధించడానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ జీఓ నంబర్ 117ను అధికారికంగా రద్దు చేయకుండా నాడు – నేడు కార్యక్రమంలో నిర్మించ తలపెట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలను నత్తనడకన సాగతీస్తోంది.

నిరుపయోగంగా తరగతి గదులు..

62వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతి గదులు, కంప్యూటర్, మ్యాథ్స్, ఇంగ్లిష్ ల్యాబ్‌లకు, ఉపాధ్యాయులు స్టాఫ్ రూమ్‌లకు కలిపి మొత్తం 20 గదులను మంజూరు చేయగా వాటిలో 10 గదులను మాత్రం ఎలిమెంటరీ స్కూల్‌లో నిర్మించి చివరిదశ పనులు నిలిపి వేసింది. సుమారు కోటి రూపాయలతో నిర్మించిన తరగతి గదులు నిరుపయోగంగా ఉన్నాయి. అదే విధంగా 63వ డివిజన్ రాజీవ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు అవసరమైన 14 అదనపు తరగతి గదులు మంజూరు కాగా వాటిలో మొదటి ఫేజ్‌లో మంజూరైన ఏడు గదులు నిర్మాణం పనులు పూర్తి కాగా మిగిలిన ఏడు అదనపు తరగతి గదుల నిర్మాణం పనులు నిలిచిపోయాయి. వీటికి గాను 10 కాంపోనెంట్స్‌తో కలిపి సుమారు కోటి 68 లక్షల రూపాయలతో అంచనాలు తయారు చేసింది. పార్ట్ బిల్లు కూడా మంజూరు చేసినట్లు తెలిసింది. 64వ డివిజన్ కంద్రికలో బీవీ సుబ్బారెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో 11 అదనపు తరగతి గదుల నిర్మాణానికి సుమారు 2.20 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించగా వాటిలో నాలుగు గదుల నిర్మాణం పనులు పూర్తి కాగా మిగిలిన ఏడు తరగతి గదులు పనులు జరుగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు నాలుగు నెలలు కావస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పన ఊసే లేదు. కోట్లాది రూపాయలతో నిర్మించ తలపెట్టిన నాడు-నేడు నిర్మాణం పనులు వేగవంతం చేసి పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరగతి గదులను వినియోగించాలి..



విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు – నేడు, మన బడి కార్యక్రమాన్ని చేపట్టింది. పెండింగ్‌లో ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణాలను ఈ ప్రభుత్వం పూర్తి చేసి వాటిని ఉపయోగించుకోవాలి. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లిష్ ల్యాబ్‌లు, ఉపాధ్యాయులు స్టాఫ్ రూమ్స్ వినియోగించాలి.

– యరగొర్ల తిరుపతమ్మ, 64వ డివిజన్ కార్పొరేటర్

పార్టీ పటిష్టతకు మరింత కృషి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



29వ డివిజన్ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా.. భుజాన ఎత్తుకున్న జెండాను దింపకుండా పార్టీ కోసం పాటుపడుతున్న ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 29వ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త సగర్వంగా చెప్పుకునేలా జగనన్న ఐదేళ్ల పరిపాలన కొనసాగించారన్నారు. ముఖ్యంగా 29వ డివిజన్‌లో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆర్‌యూబీ నిర్మాణంతో ప్రజల దశాబ్దాల కల నెరవేర్చామని చెప్పారు. రూ.1.15 కోట్లతో రోడ్డు పనులు, రూ.15.35 లక్షలతో నూతన శానిటరీ కార్యాలయం, రూ.42 లక్షలతో వంగవీటి మోహనరంగా కర్మల భవనం, లెక్చరర్స్ కాలనీలో రూ.17 లక్షలతో ఓపెన్ జిమ్, పార్కు ప్రారంభించామని చెప్పారు.

ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తాం..

అలాగే వెంకటేశ్వర కో ఆపరేటివ్ సొసైటీ పరిధిలో బావి రోడ్డు, తుంగం కోటేశ్వరరావు రోడ్డు, హనుమంతరావు రోడ్డులోని ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించినట్లు విష్ణు తెలిపారు. కానీ ఈ ప్రభుత్వంలో పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలోనూ ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని.. కేవలం 5 నెలల కాలంలోనే అన్ని వర్గాల ప్రజలు రోడ్లపైకి వచ్చారన్నారు. సూపర్ సిక్స్ అంటూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. ప్రజలు ఈ ప్రభుత్వంపై తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. మరోవైపు కూటమి నేతలు అసత్య ఆరోపణలు, దాడులే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారని.. వారికి ఎదురొడ్డి పోరాడేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలన్నారు. కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా.. పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా భరోసా కల్పించారు. సమావేశంలో నాయకులు కంభం కొండలరావు, ఎస్.కె.బాబు, అక్బర్, యరగొర్ల శ్రీరాములు, జాక్సన్, దాసం రామరాజు, జి.వాసు, సిద్దే సన్యాసి రాజు, జయలక్ష్మి, దేవినేని సుధాకర్, బోనం నాగు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాల సమాహారం సింగంపల్లి కవిత్వం



అశోక్‌కుమార్ మినీ కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడకల్చరల్: సింగంపల్లి అశోక్ కుమార్ కవిత్వం సామాజిక అంశాల సమాహారమని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. సింగంపల్లి అశోక్‌కుమార్ రచించన ఎరుపు మినీ కవితా సంపుటి ఆవిష్కరణ సభ విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి సమాజంలో జరుగుతున్న వాస్తవ సమస్యలకు అశోక్‌కుమార్ అక్షర రూపమిచ్చినట్లు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి మాట్లాడుతూ అశోక్‌కుమార్ శ్రీశ్రీ సాహిత్య నిధి ద్వారా శ్రీశ్రీ సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఏసీటీఎఫ్ పూర్వ కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ ఎరుపు కవితా సంపుటిని ఆవిష్కరించారు. సాహితీ స్రవంతి ఉపాధ్యక్షుడు సత్యాజీ, జనసాహితీ అధ్యక్షుడు దివికుమార్, విరసం అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ తదితరులు ప్రసంగించారు. రచయిత అశోక్‌కుమార్ తనకు ప్రేరణ కలిగించిన అంశాలను వివరించారు.

కాలుష్య రహిత నగరానికి చర్యలు



యునిడో ప్రతినిధులతో చర్చిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(యునిడో) ప్రతినిధులకు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర వివరించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో యూనిడో ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)లలో జరుగుతున్న అభివృద్ధి పనులను యూనిడో ప్రతినిధులకు వివరించారు. మురుగునీటి శుద్ధతపై వీఎంసీ తీసుకుంటున్న చర్యలు, యూనిడో నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పురోగతి తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ ఎస్పీ సింగ్, కో ఆర్డినేటర్ దీపిక పాల్గొన్నారు.

పార్కులలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించండి

పటమట(విజయవాడతూర్పు): పార్కులలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనం డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రూమ్‌లో ఉద్యానవనాలపై పార్క్ సూపర్‌వైజర్లతో కమిషనర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పార్కులలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని, నిరంతరం పార్కులలో ఉన్న హరితాన్ని పర్యవేక్షిస్తుండాలన్నారు. పరిశుభ్రతలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, పార్కుల్లో ఆట పరికరాలు పాడైతే ఇంజినీరింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని, పరికరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. నగరవాసులు పార్కులలో ఆనందంగా గడిపేలా పార్కులను తీర్చిదిద్దే బాధ్యత పార్కు సూపర్‌వైజర్లదేనని పేర్కొన్నారు. సమావేశంలో డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, పార్క్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 29వ డివిజన్ మధురానగర్ మెయిన్ రోడ్డు, మధురానగర్ ఆర్‌యూబీ తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లను బుధవారం టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. ఇటీవల పండుగలు, ఆర్‌యూబీ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని భారీగా ఫ్లెక్సీలు, బ్యానర్లను అనుమతి లేకుండా ఏర్పాటు చేశారు. దీంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది వాటిని తొలగించారు.

రేపటి ధర్నా విజయవంతానికి పిలుపు



కృష్ణలంక(విజయవాడతూర్పు): అసంఘటిత భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించి సంక్షేమ బోర్డును పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన ధర్నాచౌక్‌లో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) విజయవాడ తూర్పు సిటీ అధ్యక్షుడు వి.బి.రాజు పిలుపునిచ్చారు. రాణిగారితోటలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. 1214 మెమో రద్దుచేసి సంక్షేమ బోర్డును వెంటనే పునర్ధారణ చేయాలన్నారు. ఇసుకను ఉచితంగా అందుబాటులోకి తెచ్చి నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని, బిల్డింగ్ మెటీరియల్ ధరలు తగ్గించి ఉపాధి కల్పించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కల్తీ ఆహారం ప్రాణాంతకం



మాట్లాడుతున్న మోహన్‌రావు కొఠారి

మధురానగర్(విజయవాడసెంట్రల్): కల్తీ ఆహారాన్ని తీసుకోవటం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తటంతో పాటు కొన్ని సందర్భాలలో ప్రాణాంతకం అవుతుందని ఎన్టీఆర్ జిల్లా అఖిల భారతీయ గ్రాహక్ పంచాయిత్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రావు కొఠారి అన్నారు. స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఆహారపు కల్తీ అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది.

కల్తీ జరగకుండా చూసుకోవాలి..

కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆహారంలో కల్తీ క్షమించరాని నేరంగా పరిగణించాలన్నారు. ఆహారంలో కల్తీ ఏ విధంగా జరుగుతుంది వాటిని ఏ విధంగా గుర్తించాలో వివరించారు. ఆహార పదార్థాల ప్యాకెట్లపై ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ముద్ర ఆహార భద్రతను సూచిస్తుందన్నారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ముద్ర ఉన్న ఆహార పదార్థాలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు కల్తీ ఏ విధంగా జరుగుతుందో తెలుసుకోవటంతో పాటు కల్తీ జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను తోటివారికి సామాజిక బాధ్యతగా తెలియజేయాలన్నారు. వినియోగదారుల క్లబ్ కన్వీనర్ డాక్టర్ కె.నవీన నూతన వినియోగదారుల రక్షణ చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న సుబ్బరాయుడు తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అన్ని రంగాల్లో వెనుకబడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేతిగుంట్ల సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ దిశగా ప్రస్తుత ప్రభుత్వం కృషి చేయాలన్నారు. దీనిపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. కేంద్రానికి ప్రతిపాదన పంపాలని కోరారు. బీసీ జనాభాలో రజకులు రెండో స్థానంలో ఉన్నారని, రాజకీయంగా సరైన ప్రాతినిధ్యం దక్కలేదన్నారు. టీటీడీ పాలక మండలిలో రజకులకు అవకాశం కల్పించాలని కోరారు. రజకులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు అరికట్టాలన్నారు. రజకులకు ప్రభుత్వం మంజూరు చేసిన దోబీఘాట్‌లు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని తిరిగి రజకులకే కేటాయించాలని కోరారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే వెల్ఫేర్ కమిటీని ఇంప్లిమెంట్ చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి రజకుల సాంఘిక, ఆర్థిక, రాజకీయ పురోగతి ఏ విధంగా ఉందని తెలుసుకుని, దానిపై చర్చించి రజకులకు న్యాయం చేయాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో రజక చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలిశెట్టి తిరుపతయ్య, రాష్ట్ర మహిళా సెక్రటరీ చోరగుడి శివ లలిత, చీమలకుర్తి ఎల్లప్ప, చాతపర్తి బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తోలుబొమ్మలాట

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కాకినాడ మాధవపట్నంకు చెందిన శ్రీసాయి నిలయం వారు ప్రదర్శించిన తోలు బొమ్మలాట భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై తోట బాలకృష్ణ శిష్య బృందం రామాయణం, మహాభారతంలోని పలు ఘట్టాలను తోలుబొమ్మల రూపంలో చక్కగా ప్రదర్శించారు. అంతరించి పోతున్న కళలలో ఒకటైన తోలు బొమ్మలాటను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం తోలు బొమ్మలాటను ప్రదర్శించిన బాలకృష్ణ శిష్య బృందంకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు. ఆలయ డీఈవో రత్నరాజు కళాకారులకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు అందించారు.

నూతన క్రీడా పాలసీలో పారా క్రీడాకారులకు ప్రత్యేక స్థానంపై హర్షం



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోటేశ్వరరావు

విజయవాడస్పోర్ట్స్: నూతన క్రీడా పాలసీలో పారా(దివ్యాంగ) క్రీడాకారులకు ప్రత్యేక స్థానం కల్పించడం పట్ల ఆంధ్రప్రదేశ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కోటేశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పారా క్రీడాకారులను ప్రోత్సహించేలా పాలసీని రూపొందించడం అభినందనీయమని కోటేశ్వరరావు తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రం గర్వపడేలా పారా క్రీడాకారులను తయారు చేస్తామని హామీ ఇచ్చారు. క్రీడా పాలసీ రూపకల్పనలో ప్రముఖ పాత్ర పోషించిన క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వాములకు అన్నప్రసాద వితరణ



శ్రీ ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో స్వామివారు



శ్రీదత్తసాయి మందిరంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న స్వాములు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీ ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో బుధవారం కార్తిక మాసోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. స్వామివారికి విశేషంగా అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు దీపారాధన చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే మధురానగర్ శ్రీదత్తసాయి మందిరంలోని చంద్రశేఖర స్వామివారికి మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దాత పవన్ సహకారంతో స్వాములకు అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో మాలదారులు పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గాంధీహిల్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం



ప్లానిటోరియంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుజనా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహాత్మా గాంధీ స్మారక చిహ్నంగా ఉన్న గాంధీ కొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వై.సుజనాచౌదరి తెలిపారు. గాంధీహిల్ ప్రాంగణంలో అభివృద్ధి చేసిన నక్షత్ర ప్రదర్శనశాలను(ప్లానిటోరియం) ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా మూతపడి ఉన్న ప్లానిటోరియాన్ని ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. సుమారు రూ.82 లక్షలతో దీనిని ఆధునికీకరించారని చెప్పారు. విద్యార్థులకు అంతరిక్షం, గ్రహ కదలికల గురించి అవగాహన కల్పించడంలో, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన అనేక అంశాలను ప్లానిటోరియం ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. త్వరలో వీఎంసీ అధికారులతో చర్చించి గాంధీహిల్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రమేష్ కీర్తన, సీఎంహెచ్‌ఓ ఇన్‌చార్జి సురేష్‌బాబు, ఈఈ వెంకటేశ్వర రెడ్డి, టెక్నికల్ అడ్వైజర్ నారాయణమూర్తి, కూటమి నేతలు అడ్డూరి శ్రీరామ్, బుల్లా విజయ్, అర్షద్, తదితరులు పాల్గొన్నారు.

లయోలలో ముగిసిన వర్క్ షాప్

గుణదల(విజయవాడతూర్పు): దృష్టిలోపం ఉన్న వ్యక్తులకు సాధికారత కల్పించడానికి కృషి చేస్తున్నామని విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రబాబు తెలిపారు. ఆంధ్ర లయోలా కళాశాలలో బుధవారం విజువల్లీ చాలెంజ్డ్ వ్యక్తుల కోసం 'చూడకుండా చదవడం' అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ ఎనేబుల్ ఇండియా, తెలుగు విజన్, విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సహకారంతో ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల కోసం వర్క్ షాప్ నిర్వహించామన్నారు. ఆండ్రాయిడ్ టాక్‌బాక్, సీయింగ్ ఎ-ఐ వంటి సహాయక సాంకేతికతలకు 80 మంది భాగస్వాములను చేశామని చెప్పారు. ఎనేబుల్ ఇండియా, తెలుగు విజన్ నుంచి నిపుణులైన శిక్షకులచే వీరికి శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రిజిస్ట్రేషన్ల కోసం 96529 75737 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.